

## అందనంత ఎత్తు ఎదిగినం




అస్తిత్వ వేదన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో పరిపూర్ణమైంది. పదేండ్ల కాలంలో అనేక గొప్ప విజయాలను సాధించటం మామూలు విషయం కాదు. తెలంగాణ ఆత్మగౌరవం పెరగటంతోపాటు ఆర్థికాభివృద్ధిలో నెంబర్ వన్ స్టేట్‌గా నిలబడింది. అప్పటిదాకా గుజరాత్ మాడల్, మహారాష్ట్ర మాడల్ అని ఎవరికి వారు చెప్పుకొంటూ పోయిన చరిత్రను చూశాం. కానీ, వాటితో పోటీపడి వేటికీ అందనంత ఎత్తుకు తెలంగాణ ఎదిగింది. ఇది చిన్న విజయం కాదు. ఆ మాటకు వస్తే యావత్‌దేశమే అనుకరించి.. అనుసరించే దారిని తెలంగాణ వేసింది. ఇది మనకు గర్వకారణం. అమరుల జ్యోతి, కొత్త సచివాలయం, అంబేద్కర్ విగ్రహం ఇప్పుడు తెలంగాణ ఐకాన్స్. ఎన్ని విమర్శలు ఉన్నా కాళేశ్వరం అనే గొప్ప ప్రాజెక్టును కట్టుకోగలిగినం.

• **అల్లం నారాయణ,** తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్

పునర్విభజన వల్ల ఏం జరిగిందనేది వేరే అంశం. ఇక మలిదశ ఉద్యమ సమయంలో చర్చకు వచ్చిన అనేక అంశాల్లో తక్షణం ఉమ్మడి జిల్లా భౌగోళిక విస్తీర్ణాన్ని తగ్గించటం, ప్రభుత్వ పాలన ప్రతీ ఒక్కరికీ చేరువయ్యేలా చర్యలు తీసుకోవడం అనే ఆలోచనతో జిల్లాల పునర్విభజన చేపట్టారు. దీనికి దీర్ఘకాలిక లక్ష్యం ప్రాతిపదికగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం పథకాల రూపకల్పన, నిధుల కేటాయింపులు జిల్లా యూనిట్‌గానే చేస్తుంది. జిల్లాల పునర్విభజనకు ఇది కూడా ఒక కారణం. అయితే, జిల్లాల పునర్విభజనలో దాగిన మరో ఘనత... దేశంలో మొట్టమొదటిసారిగా ఒక రాష్ట్రం పట్టణ, గ్రామీణ వ్యవస్థల మధ్య సమతూకం పాటించే అద్భుతాన్ని తెలంగాణ ఆచరించి చూపించింది. కాబట్టే, పట్టణ, గ్రామీణ ప్రాంతాలు రెండూ సరిసమానంగా ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో జమిలిగా ప్రయాణం సాగిస్తున్నాయి. జిల్లాల పునర్విభజన చెట్టుకు కాసిన మధురమైన ఫలాలు ఇవే. అదే కోవలో రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు కూడా జరిగింది. అన్నిటికన్నా ముఖ్యంగా దశాబ్దాలుగా తీరని కోరికగా మిగిలిన తండాలు, గోండు, కోయ, చెంచుగూడేలు గ్రామపంచాయతీలుగా మారటం. ఇది దేశ పరిపాలన వికేంద్రీకరణలో విప్లవాత్మక చర్య. అయితే, ఇప్పుడు వీటి కుదింపుపై చర్చ సాగుతున్నది. ఈ చర్చ తెరమీదికి వచ్చినప్పుడు ఉత్తరప్రదేశ్ చేదు అనుభవం గుర్తుకు వస్తున్నది. జిల్లాల సంఖ్య పెంచడం, కుదించడం అన్నది పాలకుడి వ్యక్తిగత ఎజెండాగా కాకుండా ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాల కేంద్రంగా మాత్రమే ఉండాలి.

**సాంస్కృతిక వైభవం**

శాతవాహనుల నుంచి అసఫ్‌జాహీల వరకు తెలంగాణను ఎన్నో రాజవంశాలు పాలించాయి. ఎంతో వారసత్వ సంపదను మిగిల్చి వెళ్లాయి. కానీ, ఉమ్మడి పాలనలో అప్పటిదాకా ఉన్న ప్రతీకలను, విలువలను సర్వనాశనం చేయటం ద్వారానే ఈ ప్రాంతంపై ఆధిపత్యం చెలాయించే మార్గం సుగమం అవుతుందనే భావన అప్పటి పాలకుల్లో కనిపించేది. ఆ నేపథ్యంగా తెలంగాణ అన్ని సంస్కృతుల ధ్వంసరచన సుదీర్ఘకాలం కొనసాగింది. తెలంగాణ సమాజం తన నేల మీద తనే ద్వితీయ శ్రేణిగా న్యూనతకు లోనయ్యింది. అందువల్ల తెలంగాణ భాష భాష కాకుండా పోయింది.. పండుగలు పండుగలు కాకుండా పోయాయి. సంస్కృతి సంస్కృతి కాకుండా పోయింది. ఆఖరికి మన దేవుళ్లు దేవుళ్లు కాకుండా పోయారు. పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, మల్లన్న (మల్లికార్జునస్వామి), మడేలయ్య ఇలా ఎంతోమందితో పాటు యాదగిరి నర్సన్న, వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్న ఎవ్వరూ దేవుళ్లు కాకుండా పోయారు. ఇక బతుకమ్మ, బోనాలు... ఒకటేమిటీ తెలంగాణ సాంస్కృతిక వైభవ ప్రతీకలైన అనేక పండుగలు ఎగతాళికి గురయ్యాయి. అంతెందుకు అసలు తెలంగాణ తెలుగు భాషే కాదని, ఇక్కడివారికి భాషే రాదనే దాకా మీడియా, సినిమా



### ఎగిరిన నిర్మాణాత్మక బావుటా..

పదేండ్ల కింది వరకు అంటే 2014 దాక అభివృద్ధి, అద్భుతమైన నిర్మాణాలు అంటే హైదరాబాదే చిరునామా. చార్మినార్, గోల్కొండ, సాలార్‌జంగ్ మ్యూజియం, బిర్లా మందిర్, చౌమొహల్లా ప్యాలెస్, హై కోర్టు... బయటి ప్రపంచానికి తెలిసినవి ఇవే. మరి ఇప్పుడు... హుస్సేన్ సాగర్ తటాకం సమీపంలో ఠీవిగా నిలబడిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం, ఆ పక్కనే 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం, మరోవైపు అమరవీరుల జ్యోతి తెలంగాణ మట్టికి ఉండే సహజీవన దార్శనికతను, త్యాగాల చరిత్రను కలకాలం ఆకాశమంత ఎత్తున నిలిచేలా చేస్తున్నాయి. పదేండ్ల తెలంగాణ ప్రగతి చెక్కిన శిల్పాలకు భవిష్యత్ తరానికి వారధిగా సగర్వంగా నిలుస్తున్నాయి. ఇంకోవైపు జిల్లాల పునర్విభజనతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సమీకృత కలెక్టరేట్లు, పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయాలు తెలంగాణ దార్శనికతకు ప్రతిరూపాలుగా నిలిచాయి. ఇవే కాకుండా జిల్లాకో మెడికల్ కాలేజీ, అధునాతన ఆస్పత్రులు వెరసి నూతన నిర్మాణాలు తెలంగాణ కీర్తి పతాకాన్ని దశదిశలా ఎగరేస్తున్నాయి. ఇక తెలంగాణలోని సబ్బండ వర్గాల అస్తిత్వానికి గుర్తింపునిస్తూ రాజధానిలో చేపట్టిన సకల బీసీ కులాలకు సొంత భవనాల నిర్మాణం, ఆదివాసీ, బంజారా గిరిజనుల ఆరాధ్యులు కుమ్రంభీం ఆదివాసీ భవన్, సంత్ సేవాలాల్ బంజారా భవన్ మొదలైన నిర్మాణాలు రాష్ట్రం ఏ ఒక్కరిదో కాదు... అందరిదీ అనే భరోసాను ఇస్తున్నాయి.

